## క్లుప్తంగా

### విద్యుత్ బిల్లులు చెల్లించడం సులభం

చీరాల అర్బన్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడం సులభతరం చేసినట్లు చీరాల డివిజన్ ఈఈ కె.జాన్‌థామస్ మంగళవారం తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, యూపీఐ యాప్‌లలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఏపీసీపీడీసీఎల్ డిస్కం పేరు కనిపించదన్నారు. ఏపీసీపీడీసీఎల్ యాప్‌ని గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, డిస్కం వెబ్‌సైట్‌లోగాని బిల్లులు చెల్లించాలన్నారు. అలానే విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తారన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత బిల్ డెస్క్‌లోకి వెళ్లి ఏదైనా యూపీఐ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు. కాని క్యూఆర్ కోడ్‌ని ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, ఇతర యూపీఐ యాప్‌లు స్కాన్ చేయడం సాధ్యం కాదన్నారు. ఈవిషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

### మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా ఉండాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గూపు విధిగా ప్రతినెల 10 తేదీ సమావేశం నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

### ఘనంగా ఏబీవీపీ వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏబీవీపీ ప్రతినిధులు

చీరాల అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75వ వార్షికోత్సవాన్ని మంగళవారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక గౌతమి జూనియర్ కాలేజీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏబీవీపీ గుంటూరు విభాగ ప్రముఖ్ రఘు ఏబీవీపీ ఏ విధంగా ఏర్పాటు చేశారనే అంశాలను వివరించారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణ అలవరుచుకొని మంచి బాటలో నడవాలన్నారు. భవిష్యత్తు లక్ష్యాలను ముందుగానే ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేసి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో తడవర్తి చంద్ర, వివేకానంద సేవా సమితి సభ్యులు సర్విశెట్టి సుబ్బరామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

### డిమాండ్స్ డేను విజయవంతం చేయండి

అద్దంకి రూరల్: శ్రామికులు, కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న విధానాలను వ్యతిరేకిస్తూ జాతీయస్థాయిలో బుధవారం తలపెట్టిన డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పి. తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమాల్లో సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

చీరాల టౌన్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ పి.మాధవి గ్రామస్తులకు సూచించారు. మంగళవారం మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్త కుప్పలను, చిల్లచెట్లను తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ.. గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున పరిశుభ్రతతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ.రవితేజ అన్నారు. మంగళవారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో 104 ఉచిత వైద్యశిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు. చేతుల పరిశుభ్రతతోపాటు సురక్షిత మంచి నీరు తాగాలని ఐదేళ్లలోపు చిన్నారులకు జింక్ మాత్రలు ఓఆర్ఎస్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్టాప్ డయేరియాపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు.

# ఆకాశం వైపు.. అన్నదాతల చూపు

- తొలకరి చినుకులు పడినా నిండని కుంటలు
- ఖరీఫ్ పంటలపై సన్నగిల్లుతున్న ఆశలు



కారంచేడు ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలాలు

కారంచేడు: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు అత్యంత కీలకం. రైతులకు పండగలాంటిది. చాలా ధాన్యపు పంటలు ఖరీఫ్‌లోనే సాగుచేస్తుంటారు. వర్షం వచ్చిందంటే చాలు ఏదో ఒక పంట విత్తడానికి రైతులు సన్నద్ధం అవుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వరుణ దేవుడు మాత్రం కరుణించడం లేదు. జూలై నెల వచ్చినా ఇంత వరకు ఎక్కడ ఖరీఫ్‌కు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు కనిపించడం లేదు. అనువైన వర్షాలు లేక కనీసం సాగుకు వినియోగించుకొనే పంట కాలువల్లోకి నీరు లేక, కుంటలు నిండక అన్నదాతలు ఆకాశం వైపు చినుకు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సంవత్సరం ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో ఆనందంలో ఉన్న అన్నదాతలు తొలకరి జల్లులు కోసం వేచి చూస్తున్నారు. మబ్బులు ముఖం చాటేయడంతో జిల్లాలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**వరి సాగుపై నీలినీడలు..**

జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత రైతులు వరి సాగుపై నీలినీడలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు మెట్ట పైర్లు సాగుకు కూడా అదునుచాలక రైతన్నలు లబోదిబోమంటున్నారు. మండు వేసవిని ఎదుర్కొని పంటలను సాగు చేసేందుకు రైతులు భూములను దుక్కులు చేసుకున్నారు. అడపాదడపా కురిసిన వర్షాల వలన ఇంత వరకు ఎలాంటి ఉపయోగం చేకూరడం లేదు. జిల్లా ప్రధాన సాగు వనరులైన సాగర్, కొమ్మమూరు కాలువలకు సాగునీరు ఇప్పట్లో విడుదల చూసే అవకాశాలు కూడా కనిపించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా అరకొర వర్షాలే తప్పితే కనీసం చెరువులు నిండిన పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయంపైనే ఆధారపడిన అన్నదాతలకు గడ్డు పరిస్థితి ఎదురవుతుంది. రాత్రి సమయాల్లో వచ్చే ఉరుములు, మెరుపులు చూసి భారీ వర్షం కురుస్తుందని ఆశగా ఎదురు చూసే రైతులకు నిరాశే మిగులుతోంది. కారంచేడు మండలంలో ఇప్పటికే మినుము సాగు చూసిన రైతులు మిరప, పత్తి సాగుకు సన్నద్ధంగా ఉన్నారు. ఆగస్టు నెల మొదటి వారానికి నారుమళ్లు పోసుకోవడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. సాగర్, కొమ్మమూరు కాలువలకు గత ఏడాది సాగుకు చుక్క నీరు విడుదల కాలేదు. ఈ ఏడాదైన వర్షాలు బాగా కురిసి రిజర్వాయర్లు నిండి కాలవలకు నీరు విడుదల చేస్తారని అన్నదాతలు ఆశపడుతున్నారు.

**ఐదు లక్షల ఎకరాల్లో వరి ప్రశ్నార్థకమేనా..**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సాగర్ కాలువ పరిధిలో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. కొమ్మమూరు కాలువ పరిధిలో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం లక్ష ఎకరాల్లో వరి సాగవుతుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించి సుమారు ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఎకరానికి సగటున 35 బస్తాల ధాన్యం దిగుబడులు వచ్చిన 1.75 కోట్ల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులను సాధిస్తారు. వర్షాలు కురవకపోతే అన్నదాతల తీవ్రంగా నష్టపోతారని వాపోతున్నారు.

**ఆకాశన్నంటుతున్న బియ్యం ధరలు..**

జిల్లాలో ఇప్పటికే బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేద ప్రజలకు అందనంత దూరంలో బియ్యం ధరలు కనిపిస్తున్నాయి. బీపీటీ 25 కేజీల బస్తా రూ.1700 ఉంటే, 92 రకం బియ్యం 25 కేజీల బస్తా రూ.1600 మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఈ ఏడాది వరి సాగుపై ఏర్పడిన నీలినీడలు తొలగకుంటే రాబోవు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగి పేదవాడి నడ్డి విరవడం ఖాయంగా కనిపిస్తోంది.

# పరుగులు పెడుతున్న అధికారులు



పెదఅంబడిపూడిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న అధికారులు



కుళాయి నీటిని పరీక్షిస్తున్న అధికారులు

- అంబడిపూడి, గుంటుపల్లిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- మంచినీటిని పరీక్షించిన అధికారులు

బల్లికురవ: పత్రికల్లో వస్తే తప్ప పనిచేయని అధికారులు నేడు పరుగులు పెడుతున్నారు. మండలంలోని పెదఅంబడిపూడి, గుంటుపల్లి గ్రామాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీల ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శనివారం సాక్షి దినపత్రికలో 'పడకేసిన పారిశుద్ధ్యం–మంచంపట్టిన పల్లెలు' అన్న శీర్షికతో వచ్చిన కథనంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎంపీడీవో వై హనుమారెడ్డి, గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్‌రమీజ్ అహమ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పెదఅంబడిపూడి గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలోని సైడు కాలువలు మురుగు నిల్వలతోపాటు గ్రామానికి సరఫరా అవుతున్న సురక్షిత మంచినీటి పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపారు. మంచినీటి లోపం లేదని నిర్ధారించుకున్నారు. పారిశుద్ధ్యం, దోమల దాడితోనే రోగాలు ప్రబలాయని మూడు రోజులు గ్రామం ఎస్సీ కాలనీలో ఇంటింటా సర్వేతో జ్వర పీడితులను గుర్తించి ఉచిత వైద్య శిబిరాల ద్వారా చికిత్స చేశారు. సర్పంచ్ ఎం కుసుమ కుమారి సెక్రటరీ కేవీ అనిల్ కుమార్, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బందిచే సైడు కాలువల్లో మురుగు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. గుంటుపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఎం కృష్ణకుమారి సైడు కాలువలోని వ్యర్థాల తొలగింపునకు శ్రీకారంచుట్టారు. వర్షాలు కురుస్తున్నందున మంచినీటి ట్యాంకులను వారానికి ఒకసారి క్లోరినేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. జలుబు, దగ్గు, జ్వరంతో అస్వస్థతకు గురైతే వెంటనే గుంటుపల్లి పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని వైద్యాధికారి కోరారు.

# విద్యతోపాటు నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు

అద్దంకి: విద్యార్థులకు విద్యతోపాటు జీవన ప్రమాణాలను మెరుగుపరిచే నైపుణ్యాలు అవసరమని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అన్నారు. కళాశాలలో జీవ, రసాయన, వాణిజ్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు అవసరమైన నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర ఆధ్వర్యంలో షాంపూలను తయారుచేసే విధానం గురించి రసాయన శాస్త్ర అధ్యాపకురాలు హేమలత వివరించారు. తరువాత కామర్స్ అధ్యాపకులు శిఖామణి వినియోగదారుల చట్టం గురించి అవగాహన కలిగించారు. వృక్షశాస్త్ర అధ్యాపకుడు డీ రాజశేఖర్ విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా షాంపూ, సబ్బులను ఎలా తయారు చేస్తారో చేసి చూపారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడిలో చేర్పించిన పిల్లలతో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీ

అద్దంకి: బడిఈడు కలిగిన పిల్లలు బడిలోనే ఉండాలని సీఆర్‌ఎంటీ రమేశ్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని కొటికలపూడి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ అశోక్, ప్రధానోపాధ్యాయుడు సహకారంతో గ్రామంలో పర్యటించారు. 6- 14 సంవత్సరాల్లోపు పిల్లలను గుర్తించారు. ఈసందర్భంగా సీఆర్‌ఎంటీ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లంతా తప్పనిసరిగా బడిలోనే ఉండాలని తల్లిదండ్రులకు చెప్పారు. ఐదు సంవత్సరాలు నిండిన ఎనిమిది మంది పిల్లలను పాఠశాలలో చేర్పించారు. చేతుల శుభ్రత గురించి పిల్లలకు తెలియజేశారు. స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

చీరాల అర్బన్: లైట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేద దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ చేతుల మీదుగా అందించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నివాసముంటున్న ఇద్దరు పేద దివ్యాంగులకు ట్రైసైకిళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఆర్గనైజేషన్ అధినేత రామిశెట్టి దిలీప్–అనూష దంపతులకు తెలుపగా అందించారన్నారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చీరాలలో గత కొంతకాలంగా విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులు, నిరుద్యోగులకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డేవిడ్, సాంబయ్య, దయాకర్, శివ, వసంతరావు, గ్రేస్‌బాబు, రాజు, రాజేష్, సుభాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు దేవుడి మాన్యం కౌలు వేలం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రూపు దేవాలయాలకు చెందిన భూములు కౌలు వేలం జరుగుతుందని కార్యనిర్వహణ అధికారి ఉపరమర్తి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నమల్లవరంలోని వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన సర్వే నంబరు 313-2, 327లోని 8.59 ఎకరాల మెట్ట భూమి దేవాలయం వద్ద వేలం జరుగుతుందని తెలిపారు. బూదవాడలో ఊరచెరువుకు చెందిన సర్వే నంబర్ 52 లోని 2.49 ఎకరాల మెట్టభూమికి బూదవాడ చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద, జాగర్లమూడివారిపాలెం రామన్నకుంటకు చెందిన సర్వే నంబర్ 382-ఏ2 లోని 2.15 ఎకరాల మెట్ట భూమికి గ్రామ పంచాయతీ వద్ద వేలం జరుగుతుంది. ఈవేలం హిందు దేవదాయశాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే రైతులు రూ. 3 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. హెచ్చు పాటదారుడు డిపాజిట్ కాకుండా ఒక సంవత్సరం కౌలు చెల్లించాలన్నారు. డిపాజిట్ కింద కట్టిన మొత్తాన్ని దేవస్థానానికి జమ కట్టుకొని మళ్లీ వేలం నిర్వహిస్తారని చెప్పారు. దేవాలయానికి బకాయిలు ఉన్నవారు, లావాదేవీలు ఉన్నవారు, హిందుయేతరులు ఈ పాటలో పాల్గొనడానికి అనర్హులని పేర్కొన్నారు. ఈపాటలు పరిమితి 2024-25 నుంచి 2026-27 వరకు ఉంటుందని తెలిపారు. వేలం పాటలు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో కార్యనిర్వహణ అధికారి ద్వారా జరుగుతాయని శ్రీనివాసరావు తెలిపారు.

# జాగ్రత్తలతో డయేరియా నివారణ



డెంగీ వ్యతిరేక మాసోత్సవం జరుపుతున్న వైద్యులు

జే.పంగులూరు: సీజనల్‌గా వచ్చే అతిసార వ్యాధి నుంచి మీపిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని పంగులూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివచెన్నయ్య కోరారు. మండలంలోని చందలూరు గ్రామంలో మంగళవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలకు వాంతులు, విరోచనాలు రాకుండా సురక్షితమైన మంచినీటిని వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటిని వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఆయన తెలిపారు. ఒకటి నుంచి నాలుగు సార్లు నీళ్ల విరోచనాలు అయినచో ఆలస్యం చేయకుండా డాక్టర్లు గాని, ఏఎన్ఎంను గానీ, ఆశాలను గాని సంప్రదించాలని, వాంతులు విరోచనాలు అయితే తల్లి బిడ్డకి పాలు ఇస్తూ ఉండాలని, అవసరమైతే 108 వాహనాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చందలూరు గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, ఉపసర్పంచ్ మురకొండ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశలు, అంగన్వాడీలు, పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ చీరాల అధ్యక్షుడిగా చందలూరి





కార్యక్రమంలో మాట్లాడుతున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల అధ్యక్షుడిగా చందలూరి బాలవెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి రోటరీ క్లబ్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ 3150 శరత్ చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ రమేష్ చంద్రలు నూతనంగా ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ కార్యదర్శిగా నక్కల సురేష్‌బాబు, క్షీరపురి రోటరీ అధ్యక్షులుగా బాచిన నాగమల్లేశ్వరరావు, కార్యదర్శిగా ముప్పల వంశీకృష్ణలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డాక్టర్ ఐ.బాబూరావు ఆర్థిక సాయంతో నాలుగు సైకిళ్లను పేద విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డీవీ సురేష్, తాడివలస దేవరాజ్, జివై ప్రసాద్, కరణం శ్రీనివాసబాబు, బి.హేమంత్‌కుమార్, వలివేటి మురళీకృష్ణ, ముద్దన రఘుకుమార్, చీరాల రోటరీ, క్షీరపురి రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ కౌశల్ యోజనపై అవగాహన



పంచాయితీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చీరాల ఇన్‌చార్జి నాసిక శివాజీ అన్నారు. మంగళవారం చీరాల రూరల్ మండలం దేవాంగపురి పంచాయితీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ బండారు మురళీ బాపూజీ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకం మంజూరుకు అనుమతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 18 రకాల వృత్తి లబ్ధిదారుల జీవన శైలి పెంపొందించానికి ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ బి.వీరయ్య, డిజిటల్ అసిస్టెంట్ భాను, జూనియర్ అసిస్టెంట్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### హెల్మెట్ లేకుండా నడిపితే జరిమానా



హెల్మెట్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై హరిబాబు

చీరాల రూరల్: నూతన చట్టాల ప్రకారం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా తమ వాహనాలను నడిపితే భారీగా జరిమానాలు విధిస్తామని ట్రాఫిక్ ఎస్సై పి. హరిబాబు అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఎస్సై హరిబాబు పాల్గొని వాహనదారులకు నూతన చట్టాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వారు ప్రమాదాల్లో ఇరుక్కుంటే పెద్దవాళ్లు కూడా నేరస్థుల జాబితాలోకి చేరుతారని చెప్పారు. సదస్సులో ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాసరావు, సోషల్ వర్కర్, పారా లీగల్ వలంటీర్ మతిన్, కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలే రోటరీ ధ్యేయం





ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

వేటపాలెం: రోటరీ క్లబ్ సంస్థ ద్వారా సేవ చేసి సమాజంలో గౌరవాన్ని పొందవచ్చని జిల్లా గవర్నర్ కే. శరత్‌చంద్ర అన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో 2024–25 సంవత్సరానికి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి రోటరీ జిల్లా గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ అవ్వొచ్చని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతం చేసి క్లబ్‌కు గుర్తింపు గౌరవాన్ని తేవాలని పిలుపునిచ్చారు. కార్యవర్గ సభ్యులు నియమ నిబంధలను తెలియజేసే పుస్తకాలను అందజేశారు. ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా అవార్డు అందుకున్న బట్టా మోహన్‌రావును అభినందించారు. జిల్లా జాయింట్ సెక్రటరీ వి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులను పెంచేందుకు ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు, కార్యదర్శి వీ లక్ష్మణస్వామి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చీరాల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు, మాజీ అసిస్టెంట్ గవరన్నర్ ఎం సుధీర్‌కుమార్, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారం, కొత్త శ్రీనివాసరావు, పొగడదండ రవికుమార్, శివరామకృష్ణ, సున్నా నాగేంద్రరావు, పింజల ప్రసాద్, ఉపేద్ర గుప్తా పాల్గొన్నారు.

# గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ షాలినీ

స్వర్ణ (కారంచేడు): గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు క్రమం తప్పకుండా మీ సమీప ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ షాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి సలహాలు అందించారు. గర్భిణులు ప్రతి ఒక్కరూ మూడో నెలలోనే మీ ప్రాంత ఆశలు, ఏఎన్ఎంల వద్ద మీ పేరు, ఊరు, అడ్రస్, కాన్పు, వైద్యపరీక్షల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అప్పటి నుంచి వైద్య సిబ్బంది మీకు అందుబాటులో ఉంటూ మీకు అవసరమైన అన్ని ఇంజక్షన్లు చేస్తూ ఇంకా అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తారన్నారు. ముఖ్యంగా రక్తహీనతతో ఇబ్బందులు పడే వారిని గుర్తించి వారిని హైరిస్క్ గర్భిణుల జాబితాలో నమోదు చేసి అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. మీ బ్లడ్ గ్రూప్‌నకు తగిన రక్త నిల్వలు కూడా అందుబాటులో ఉంచుతారన్నారు. సుఖప్రసవం వరకు మీకు అవసరమైన అన్ని సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 26 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

# పన్నుల వసూలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల: పట్టణ పరిధిలోని ఆస్తి, నీటిపన్నులు, ఖాళీ స్థలాల పన్నుల వసూలును వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూలులో జాప్యం కాకుండా చూడాలన్నారు. మార్కెట్లకు సంబంధించిన లీజులు, షాపు రూములకు సంబంధించిన అద్దెలు ఆలస్యం చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# 30 శాతం సబ్సిడీపై కందులు, పెసలు

బల్లికురవ: ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా 30 శాతం సబ్సిడీపై కందులు, పెసలు అందజేస్తుందని.. అర్హులైన రైతులు పొందాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి మంగళవారం తెలిపారు. 20 రైతు సేవా కేంద్రాలకు 10 క్వింటాళ్ల కందులు, 6 క్వింటాళ్ల పెసలు కేటాయించారని ఆధార్‌కార్డు, సెల్ ఫోన్‌తో సబ్సిడీ విత్తనాలు పొందవచ్చన్నారు. కందులు రాయితీ పోను కిలో రూ 97. 86 పైసలు, పెసలు రాయితీ పోను కిలో రూ. 91 చెల్లించాలని ఏవో వివరించారు.